క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తీర్మానం



రెంజల్(బోధన్): ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం వెంటనే రూ.500 బోనస్ చెల్లించాలని సభ్యులు తీర్మానించారు. శుక్రవారం రెంజల్ సహకార సంఘం ప్రత్యేకాధికారి అశోక్‌కుమార్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సభ్యులు పలు తీర్మానాలను సభ దృష్టికి తీసుక వచ్చారు. నూతన సభ్యత్వం చేపట్టాలని, ఎల్‌టి, హెచ్‌వో రుణాలను రికవరీ చేయాలని తీర్మానించారు.సంఘం సంవత్సర జమా ఖర్చుల నివేదికను విండో సీఈవో ఇంద్రసేన్ సభ్యులకు చదివి వినిపించారు. సమావేశంలో మాజీ చైర్మెన్ మొయినోద్దీన్‌తో పాటు మాజీ డైరెక్టర్‌లు, సంఘ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయానికి రూ. 50 వేల విరాళం



మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లిలో గ్రామాభివృద్ధి కమిటీ నూతనంగా నిర్మిస్తున్న నీలకంఠేశ్వర శివాలయ నిర్మాణానికి పలువురు విరాళం అందజేశారు. అదే గ్రామానికి చెందిన దొడ్ల ప్రవీణ్, వంజరి సుమన్ వేర్వేరుగా రూ. 25,000 లను శుక్రవారం వీడీసీ సభ్యులకు వారు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న, తలారి నర్సయ్య, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాం గ్రామంలో పంటలను చెరుకు, వరి పరిశోధన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్తలు రాకేష్, కృష్ణ చైతన్యలు పరిశీలించారు. నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా వరి పంటను పరిశీలించినట్లు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి వసంత్, ఏఈవో సాయి కృష్ణ, గ్రామరైతులు, తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీలకు శ్రీవల్లి ఎంపిక



వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన నృత్యకారిణి పల్లి శ్రీవల్లి ఈనెల 28న మలేషియాలో నిర్వహించే బతుకమ్మ దసరా సంబరాల శాస్త్రీయ నృత్య పోటీలకు ఎంపికైనట్లు తల్లిదండ్రులు జైపాల్, రాధిక శుక్రవారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రీవల్లి ఆర్మూర్‌లోని నటరాజ నృత్యనికేతన్‌లో శిక్షణ పొందుతున్నట్లు పేర్కొన్నారు.

చర్చిలో ఘనంగా ఆశీర్వాద పండుగలు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో గల ఎల్ షద్దాయ్ చర్చిలో పాస్టర్ శేఖర్ ఇడ్విన్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆశీర్వాద పండుగలు శుక్రవారం ముగిశాయి. పండుగలకు తెలంగాణతో పాటు ఏపీ నుంచి పాస్టర్లు హాజరై ఏసు క్రీస్తు బోధనలు తెలియజేశారు. అలాగే ఆశీర్వాద పండగల కార్యక్రమానికి పరిసర జిల్లాల నుంచి క్రైస్తవులు పెద్దమొత్తంలో హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు వేద నాయకం, సన్నీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండల అంకాపూర్ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నందిపేట మండలం వన్నెల్ కే గ్రామానికి చెందిన బొంత మహిత కుటుంబ సభ్యులకు రూ.4 లక్షల విలువగల ఎల్‌వోసీ అందజేశారు. వన్నెల్ కే గ్రామానికి చెందిన మహిత అనారోగ్యంతో హైదరబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకుంటున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేసుకోగా, అందుకు సంబంధించిన ఎల్‌వోసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు సూర శ్రీకాంత్, నడిశరం మల్లయ్య, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొత్తూరు గిరీష్, డాక్టర్ అరుణ్, హరీష్, ప్రళయ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత మండపాల వద్ద కుంకుమార్చన



జలాల్‌పూర్‌లో యజ్ఞంలో పాల్గొన్న భక్తులు




ముప్కాల్‌లో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



రుద్రూర్ శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో..



రుద్రూర్ శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో మహా చండీ హోమంలో పాల్గొన్న భక్తులు



కాల్‌పూర్ ఆశ్రమంలో మహాలక్ష్మి అలంకరణలో దుర్గామాత

ఆర్మూర్‌టౌన్/మాక్లూర్/బాల్కొండ/రుద్రూర్/వర్ని : ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పలు మండపాల వద్ద నిర్వహించిన కుంకుమార్చన పూజలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. రుద్రూర్‌మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మహా చండీహోమం నిర్వహించారు. అమ్మవారికి 56 రకాల స్వీట్లతో నైవేద్యం సమర్పించారు. శ్రీ లలిత త్రిపుర సుందరి దేవిగా దుర్గామాత దర్శనమిచ్చింది. నందిపేట మండలం కౌల్‌పూర్ ఆశ్రమంలో చింత రమేష్ స్వామి ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. శుక్రవారం మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. నందిపేట మండలం వన్నెల్ కే గ్రామ సమీపంలోని గోదావరి పరివాహక ప్రాంతంలోని శ్రీ రామలింగేశ్వర ఆలయంలో దుర్గామాత మండపం వద్ద త్రికులు ప్రభాకరచారి, రిటైర్డు వార్డెన్ మగ్గిడి చింత దేవిదాసు, మాజీ సర్పంచు పోతుల గణేష్, విశ్రాంత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో యజ్ఞం, హోమాలు నిర్వహించారు.మోస్రా మండలం చింతకుంట, తిమ్మాపూర్ ,మోస్రా గ్రామాల్లో నెలకొల్పిన దేవి మండపాల్లో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి ఆలూర్ మండల కేంద్రంలో లెవెన్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. యూత్‌సభ్యులు వినయ్ రెడ్డిని సన్మానించారు.కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్‌లో ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపం వద్ద అన్నదానం చేశారు. వర్ని మండలం జలాల్‌పూర్ లో దుర్గామాత మండపం వద్ద యజ్ఞం చేశారు.



ఆర్మూర్‌లో శ్రీ లక్ష్మీనర్సింహ దుర్గామాత మండపం వద్ద కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



మోస్రాలో దుర్గామాత మండపం వద్ద పూజలు చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



దీకంపల్లిలో ..



వన్నెల్ కేలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలి



బోధన్‌లో మాట్లాడుతున్న డీసీవో శ్రీనివాస్

బోధన్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలని డీసీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఏ ఎంసీ కార్యాలయం ఆవరణలో గల రైతు వేదికలో సహకార, వ్యవసాయ శాఖల అధ్వర్యంలో డివిజన్ స్థాయి సొసైటీ సీఈవోల తో ధాన్యం కొనుగోలు సన్నాహాక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో డీసీవో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలల్లో ధాన్యం సేకరణకు అన్నీ విధాల సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏడీఏ ఎండీ అలీం,సహకార శాఖ బోధన్,నవీపేట క్లస్టర్ అధికారులు రవీందర్, రమావతి, సివిల్ సప్లయ్ టెక్నికల్ ఆఫీసర్ నరేందర్, ఏఈవోలు,సొసైటీ సీఈవోలు పాల్గొన్నారు.

కల్లూర్ వీడీసీ ఏకగ్రీవ ఎన్నిక

రుద్రూర్: పోతంగల్ మండలం కల్లూర్ గ్రామాభివృద్ధి కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా శ్రవణ్, కార్యదర్శిగా గోపాల్ ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి మూడేళ్లకు గ్రామ కమిటీని ఎన్నుకుంటామని పేర్కొన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి



చందూరులో ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రజక సంఘం నాయకులు



డొంకేశ్వర్‌లో రజక సంఘం సభ్యుల ఆధ్వర్యంలో..



బాల్కొండ మండల కేంద్రంలో..

సాక్షి, నెట్‌వర్క్ : ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలూర్ మండలకేంద్రంలో, ఆర్మూర్ పట్టణంలోని ధోబీఘాట్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చాకలి ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటాలకు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, దళిత సంఘాలు, రజక సంఘాల ఆధ్వర్యంలో నాయకులు నివాళులు అర్పించారు. చాకలి ఐలమ్మ తొలి భూపోరాటానికి నాంది పలికిన వీరమాత అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆయన వేల్పూర్‌లో శివగౌరి రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఘనంగా ఈరవత్రి అనిల్ జన్మదిన వేడుక



ముప్కాల్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రాల్లో శుక్రవారం మాజీ ప్రభుత్వ విప్, టీఎస్ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. పార్టీ మండల అధ్యక్షులు వెంకటేష్, ముత్యంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు జైడి రవి, ఇమ్రాన్, కిసాన్‌ఖేత్ మండల అధ్యక్షుడు బద్దం సాగర్ , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీజీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు సుంకెట రవి కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు తిప్పిరెడ్డి శ్రీను, గోపిడి లింగారెడ్డి, పడిగెల ప్రవీణ్, సల్లూరి గణేష్‌గౌడ్, నల్ల గణేష్, భాస్కర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియాన్ని ఉపయోగించుకోవాలి

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



ఇండోర్ స్టేడియంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వేల్పూర్: వేల్పూర్ మినీస్టేడియంలో ఆధునీకరించిన ఇండోర్ స్టేడియంను క్రీడాకారులు ఉపయోగించుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్‌లో ఆధునీకరించిన ఇండోర్ స్టేడియంను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, కబడ్డీ ఆటలు ఆడడానికి ఎంతో సౌకర్యంగా రూపుదిద్దుకుందని చెప్పారు. కబడ్డీ ఆటకు అవసరమైన మ్యాట్స్ కూడా రాబోతున్నాయన్నారు. ప్రత్యేకంగా వేల్పూర్ యువకులు, మండల ప్రజలు ఉపయోగించుకొని తమ క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. స్టేడియంలో సౌకర్యాలు మెరుగు పరచడానికి రాజ్యసభ సభ్యుడు, ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్‌ను అడిగిన వెంటనే రూ. 35 లక్షలు మంజూరు చేశారన్నారు. వేల్పూర్‌లో ప్రైమరీ స్కూలు కొత్త భవనానికి రూ. కోటి 3 లక్షలు, హైస్కూలులో అదనపు గదులకు రూ. 25 లక్షలు, ముదిరాజ్ సంఘం నిర్మాణానికి రూ. 20 లక్షలు, క్రిస్టియన్ గ్రేవ్‌యార్డుకు రూ. 5 లక్షలు మంజూరు చేశారన్నారు.డీఎస్‌వో పవన్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు రేగుల్లరాములు, జైడి నాగధర్‌రెడ్డి, పిట్లసత్యం, ఏనుగు గంగారెడ్డి, దొల్ల రాజేశ్వర్‌రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరెంట్-టీచర్ మీటింగ్



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మధుకుమార్

కమ్మర్‌పల్లి: పిల్లలు చదువులో రాణించాలంటే తల్లిదండ్రుల పాత్ర కీలకమని కమ్మర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధుకుమార్ అన్నారు. శుక్రవారం కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కళాశాలను రెగ్యులర్‌గా హాజరయ్యేలా చూడాలని సూచించారు. వీడీసీ అధ్యక్షుడు రామస్వామి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పూజారి అలేఖ్య, అధ్యాపకులు వెంకటేష్, రాజ్ కుమార్, వైష్ణవి, గంగాధర్, మహేందర్, శ్రీహరి, మురళీకృష్ణ, స్వాతి, సుమతి, స్రవంతి పాల్గొన్నారు. అలాగే నందిపేట మండలం అయిలాపూర్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ చిన్నయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో క్రమం తప్పకుండా క్లాసులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆ ఫీ సర్ వెంకటేశం, ఏఎంసీ ఇన్‌చార్జి శ్రీనివాస్, అధ్యా పకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి తొలి ప్రాధాన్యత

- ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి
- జాడిజమాల్‌పూర్‌లో విద్యుత్ సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన



జాడిజమాల్‌పూర్‌లో సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్: వ్యవసాయ రంగాన్ని పటిష్టత కోసం ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోందని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు.గత ప్రభుత్వ హాయంలో పదేళ్ల విద్యుత్ సమస్య పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిందన్నారు. సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామంలో రూ.2 కోట్ల 23 లక్షలతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పనులకు ఎమ్మెల్యే అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం 16 సబ్ స్టేషన్‌లు మంజూరు చేసిందన్నారు.ఇందులో బోధన్ నియోజకవర్గానికి మూడు సబ్ స్టేషన్‌లు వచ్చాయన్నారు. గ్రామంలో గ్రూప్ వివాదాలు వీడి కలిసి మెలిసి అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. గ్రామ నాయకుడు సుందర్ రాజ్ గ్రామంలో పలు అభివృద్ధి పనులు, సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించగా సానుకూలంగా స్పందించారు ట్రాన్స్‌కో జిల్లా ఎస్ఈ రవీందర్, డివిజన్ డీఈ ముక్తార్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, డైరెక్టర్ శరత్, గ్రామ పెద్దలు ,సుందర్‌రాజ్, బాలస్వామి, గోగినేని నర్సయ్య, దేవదానం, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాశంకర్, నాగేశ్వర్‌రావు, మందర్న రవి, అల్లె రమేష్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

నవీపేట:పెరుగుతున్న వినియోగానికి అనుగుణంగా విద్యుత్‌ను పొదుపుగావాడుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. మండలంలోని హనుమాన్ ఫారమ్ గ్రామంలో రూ. 2.23 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించతలపెట్టిన సబ్‌స్టేషన్ పనులకు ఆయన భూమిపూజ చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు పాటుపడాలి



ఆలూర్‌లో నిర్వహించిన చాయ్ పే చర్చలో పాల్గొన్న వినయ్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. ఆలూర్ మండలానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఆలూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, ఏఎంసీ డైరెక్టర్ వైస్ మల్లా రెడ్డి, నాయకులు పండిత్ పవన్, ఉదయ్, ముత్యం రెడ్డి, సంజీవ్, శ్రీనివాస్, చిరంజీవి, కిషన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మంజీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బోధన్: మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నందున రెవెన్యూ డివిజన్ పరిధిలోని మంజీర నది తీర ప్రాంత పోతంగల్, సాలూర, బోధన్,రెంజల్ మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో శుక్రవారం ప్రకటనలో తెలిపారు.లోతట్టు ప్రాంత గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, మంజీర నదిలో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని సబ్ కలెక్టర్ సూచనలు చేశారు.

ఘనంగా అంగన్‌వాడీ బతుకమ్మ



బోధన్ ఉషోదయ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు,టీచర్లు



డొంకేశ్వర్‌లో.. అంగన్‌వాడీ టీచర్లు



మాక్లూర్ పీహెచ్‌సీలో .. వైద్యసిబ్బంది

డొంకేశ్వర్/బోధన్‌టౌన్ : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచ ర్లు చేతితో బతుకమ్మలను తయారు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ హాజరయ్యారు. బోధన్‌లోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు పూలతో బతుకమ్మలను పేర్చి ఆటలు ఆడుతూ పాటలు పాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సీడీపీవో పద్మ హాజరై బతుకమ్మ ఆడారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించారు. విద్యార్థినులకు క్యాష్ ప్రైజ్‌ను అందజేశారు. వెంకట రమణి, సునీత్ దుష్యంత్, ప్రిన్సిపాల్స్ గంగాధర్, హరికృష్ణ, టీచర్లు ఉన్నారు.

మహిళల వైద్య శిబిరానికి విశేష స్పందన



డొంకేశ్వర్‌లో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్

డొంకేశ్వర్/నందిపేట/వర్ని/రుద్రూర్ : వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ మహిళల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ రకాల వైద్యులు మహిళలకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 130 మంది మహిళలు వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యులు సూచించిన మందులను పొందారు. ఈ వైద్య శిబిరాన్ని ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ పరిశీలించారు. అలాగే నందిపేట పీహెచ్‌సీలో నిర్వహించిన పరివార్ వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ శిబిరంలో 154 మంది మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు జరిపినట్లు మండల వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు.వర్ని ప్రభుత్వ ఆస్పత్రిలో పరివార్ వైద్య శిబిరం నిర్వహించారు.ఈశిబిరంలో 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వర్ని మెడికల్ ఆఫీసర్ స్నేహ వెల్లడించారు. రుద్రూర్ పీహెచ్‌సీలో 116 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం నిర్వహణపై సమీక్ష




బోధన్: పట్టణ శివారులోని కేంద్రీయ విద్యాలయం, పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్‌ల సమర్థవంతంగా నిర్వహణపై శుక్రవారం తన చాంబర్‌లో కేంద్రీయ విద్యాలయం మేనేజ్‌మెంట్ అధికారులు, ,ఎంఈవో నాగయ్యలతో సబ్ కలెక్టర్ వికాస్ మహతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు ,ఫలితాలు,అడ్మిషన్ ప్రక్రియ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బోధన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రారంభించిన సబ్ కలెక్టర్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో శుక్రవారం హెచ్‌డీఎఫ్‌సీ నూతన భవనాన్ని సబ్ కలెక్టర్ వికాస్ మహతో ప్రారంభించారు. ప్రజలకు మరిన్న సేవలను అందించాలని సబ్ కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ట్రస్ట్ మేనేజర్ బసవేశ్వర్‌రావ్, హెచ్‌డీఎఫ్‌సీ జోనల్ మేనేజర్ కరుణాకర్ రెడ్డి, బాలకృష్ణ, మేనేజర్ మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నందిపేటలో గాలివాన బీభత్సం



వెల్మల్ చౌరస్తా వద్ద పడిపోయిన వృక్షం



వెల్మల్‌కు వెళ్లే మార్గంలో ..

నందిపేట్(ఆర్మూర్): మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ ఈదురు గాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బలమైన గాలులకు నందిపేట నుంచి వెల్మల్ వెళ్లే మార్గంలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే వెల్మల్-ఆలూర్, కుద్వాన్‌పూర్- నందిపేట గ్రామాల మధ్య పదుల సంఖ్యలో చెట్లు కూలిపోయాయి. ఎక్కడికక్కడ విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.